క్లుప్తంగా

నవోదయలో క్రమశిక్షణతో ఎన్‌సీసీ

ఉమ్మడి రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డీడీజీ రెడ్డి



నవోదయ ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న డీడీజీ రెడ్డి

పెద్దాపురం: ఎన్‌సీసీ విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నవోదయ విద్యాలయాల ద్వారానే సాధ్యపడుతుందని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డీడీజీ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని బుధవారం పెద్దాపురం జవహర్ నవోదయ ఎన్‌సీసీ విద్యార్థులు చేస్తున్న ఫైరింగ్ శిక్షణను ఆయన కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఏకే రిషితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నవోదయలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ తీరును ఆయన అభినందించారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణకు ఫోన్ చేసి ఇక్కడి శిక్షణను వివరించి ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ పి.కిశోర్‌కుమార్, విద్యాలయ సిబ్బంది, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులో చేపల వేటపై ఫిర్యాదు



సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేతల హరిబాబు

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే చెరువులో సుమారు రెండు నెలలుగా చేపల వేట సాగడం దారుణమని, దానిని వెంటనే నిలిపివేయాలని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు ఫిర్యాదు చేశారు. కేవలం పది రోజుల పాటు చేపల వేట సాగించడానికి అనుమతి ఇస్తే ఇప్పటికీ చేపల వేట కొనసాగుతోందని ఆరోపించారు. చెరువులో చేపలు, రొయ్యలు చనిపోవడం వలన తాగునీరు చెడు వాసన వస్తోందని తెలిపారు. తాగునీటి చెరువులో చేపల వేటకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. దీనిపై కమిషనర్ మున్సిపల్ ఏఈ వల్లు అరవింద్‌ను పిలిచి వెంటనే చేపల వేట నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



సామర్లకోట-పెద్దాపురం రోడ్డుపై పడిన 11 కేవీ విద్యుత్ తీగలు

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో 11 కేవీ విద్యుత్ వైర్లు బుధవారం ఒక్కసారిగా తెగి పడ్డాయి. గణపతినగరం వెళ్లే మార్గం ఎదురుగా ఉన్న రోడ్డులో ఇవి తెగిపడ్డాయి. ఆ సమయంలో బాటసారులు, వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టు అయ్యింది. విషయం తెలిసిన వెంటనే ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు పూర్తి చేశారు.

చిన్నారులను పాఠశాలలో చేర్పించాలి



గొల్లప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలంటూ గొల్లప్రోలులో బుధవారం పల్స్ జీఈఆర్ 100 డే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండలంలో ఒక్క విద్యార్థి కూడా బడి బయట లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖాధికారులను కోరారు. ఈ కార్యక్రమంపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలం విద్యా శాఖాధికారులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాలక్షేప మండపం ప్రారంభం

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి వద్ద ఉన్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో రూ.14 లక్షలతో నిర్మించిన కాలక్షేప మండపాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్టు ఆలయ ఈఓ ఎం మురళీ వీరభద్రరావు బుధవారం విలేకర్లకు తెలిపారు.

ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- విరవలో జగనన్న సురక్ష కార్యక్రమం



విరవలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. విరవ గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీలో ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు అందాలంటే జన్మభూమి కమిటీ చుట్టు ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాల అందుతున్నాయన్నారు. ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందజేస్తోందన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నికల్లో అధికారంలోకి తెచ్చుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్ నడిగట్ల చింతలరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందజేసేందుకే జగనన్న సురక్ష

సామర్లకోట: స్థానిక గాంధీనగర్ 14వ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలకు అర్హత ఉండి అందని వారికి మండల స్థాయి అధికారుల సమక్షంలో వారికి పథకాలు అందే విధంగా చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రజల కోసం పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని జీవిత కాలం ముఖ్యమంత్రిగా ఉంచుకునేలా చేయవలసిన బాధ్యత ప్రజలపై ఉన్నదన్నారు. మున్సిపల్ కమిషనర్ జె. రామారావు, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాస్, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు నాతిపాముల సూరిబాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు.

సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జీవీఎస్ ప్రసాద్ అన్నారు. శ్రీరాంపురం గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. దరఖాస్తుదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి మునలయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కట్టమూరులో..

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఎంపీటీసీ నల్లల సూర్యకుమారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందించడమే గాక ప్రజలకు అవసరమైన పౌర సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, బండారు చంటిబాబు తదితరులతో పాటు పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ జితేంద్ర, ఈఓ పీఆర్డీ మూర్తి, సచివాలయ కార్యదర్శి రాధాకృష్ణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి, యినకొండ వీర విష్ణుచక్రం, సిద్ధాంతపు ప్రసాద్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాధవపట్నంలో..

సామర్లకోట: మండల పరిధిలో మాధపట్నం గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష 289 సర్టిఫికేట్లు జారీ చేసినట్టు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని 2వ సచివాలయం పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ అధ్యక్షత వహించగా మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు గుత్తుల కృష్ణార్జునరావు, మేడిశెట్టి దుర్గాదేవి, మండల ప్రత్యేకాధికారి జీవీ సత్యనారాయణ, జగనన్న సురక్ష మండల కన్వీనర్ ఉటా వాసు, పంచాయతీ కార్యదర్శి నాగ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు



శ్రీరాంపురంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



సామర్లకోటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

సర్కారీ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన



ఎంఈఓ పుల్లయ్యను సత్కరించిన ఉపాధ్యాయులు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను అందిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్య అన్నారు. బుధవారం సాయంత్రం వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం పానెల్ బోర్డులు, స్మార్ట్ టీవీలు అందిస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు బలం చేకూర్చేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. తమ పిల్లలు ఇంగ్లిషులో మాట్లాడాలనే ఆశతో కాన్వెంట్లకు పంపుతున్నారని, ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిషులో మాట్లాడేలా తయారు చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 10 తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచి విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా మేడపాడు, వేట్లపాలేనికి చెందిన ఉపాధ్యాయులు ఎంఈఓను సత్కరించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పిఠాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యర్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు, కార్యదర్శులు కె.సిద్దు, జి.శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వారు మండల విద్యాశాఖాధికారి ఆర్వీ ప్రసాదుకు వినతిపత్రం అందజేశారు.

జగనన్న కాలనీలపై నిర్లక్ష్యం తగదు


- గృహ నిర్మాణాలను ప్రోత్సహించండి
- హౌసింగ్ పీడీ పట్నాయక్



సామర్లకోటలో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ పట్నాయక్

సామర్లకోట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం తగదని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పటాన్యక్ అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ జె రామారావు చాంబర్‌లో వివిధ శాఖ ల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీలను ప్రారంభించడానికి ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట వచ్చే అవకాశం ఉన్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించక పోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది లబ్ధిదారులు మరణించడం, మరికొంత మంది ఆర్థిక స్తోమత లేని కారణంగా ఇళ్ల నిర్మాణాలు చేయలేదని మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత తెలిపారు. లబ్ధిదారుల వారసులకు అర్హత ఉంటే వారికి ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు నిర్మించుకునేలా చేయాలన్నారు. ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఆర్థిక సహాయం చేస్తూ ఉండగా మరో రూ.35వేలు అప్పుతో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులలో అవగాహన పెంచాలన్నారు. రెండో విడత ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయితే మొదటి విడత లబ్ధిదారులు నష్ట పాయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు పూర్తి చేయడానికి పబ్లిక్‌హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, డీఎల్‌డీఓ పి నారాయణమూర్తి, హౌసింగ్ డీఈ ఆర్ఎస్‌కె రాజు, మున్సిపల్ డీఈ హుస్సేన్, సచివాలయాల అడ్మిన్‌లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోవాలి



పిఠాపురంలో అనధికార లేఅవుట్లలో రాళ్లు తొలగిస్తున్న అధికారులు

పిఠాపురం: అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోవాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు అనధికార లేఅవుట్లను పరిశీలించిన అధికారులు లేఅవుట్లలో రాళ్లను తొలగించారు. అనుమతి లేని లేఅవుట్లగా హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. అనధికార లేఅవుట్లు వేసిన యజమానులు, కొనుగోలు దారులు ఆయా స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకూ నిర్మాణాలు చేపట్టకూడదని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

కరప-అరట్లకట్ట రహదారి పరిశీలన

కరప: కరప–అరట్లకట్ట రోడ్డు ఆధునీకరణ పనులను బుధవారం ఆ శాఖాధికారులు పరిశీలించారు. గొడ్డటిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డుపై నుంచి వర్షం, మురికినీరు ప్రవహిస్తుండటంతో గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉంటోందని, గ్రామంలో సీసీ డ్రెయిన్లు నిర్మించేటప్పుడు నీరుపోయేలా తూములు ఏర్పాటుచేయాలని సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు అధికారులను కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఈఈ పి.రమేష్‌కుమార్ తెలిపి, గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నట్టు తెలిపారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా ఉండాలి

- ఆర్డీఓ సీతారామారావు



సామర్లకోటలో బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సీతారామారావు

సామర్లకోట: ఓటర్ల సర్వే పారదర్శకంగా ఉండాలని, దానికి ఓటర్ల సహకారం ఏంతో అవసరమని ఆర్డీఓ సీతారామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 128, 129, 130, 131, 132 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఓటర్ల సర్వేను ఆర్డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ఓటుకు ఎంతో విలువ ఉన్నదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఒకే ఇంటిలో 10 ఓట్లకు మించి ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్లను వివరాలు అడిగే సమయంలో ఓటరు లిస్టులో ఉన్న వారి పేరు చదివి వినిపించడంతో పాటు వారి ఫొటోను ఓటర్లకు చూపించాలన్నారు. ఓటర్లకు ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టీపీఓ ఫణికుమార్, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వడ్లమూరులో సర్వే పరిశీలన

పెద్దాపురం: డివిజన్‌లో జరుగుతున్న ఓటరు జాబితా రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ రామారావు ఆదేశించారు. బుధవారం మండలంలోని వడ్లమూరులో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజలు మరింత పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఓటరు జాబితాలపై అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీటించారు. పంచాయతీ కార్యదర్శి కళ, వైఎస్సార్ సీపీ నాయకలు కంటే వీర్రాఘవరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఓటర్లను గుర్తించాలి

కొత్తపల్లి: ఓటర్ల జాబితా సర్వేలో నకిలీ ఓటర్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్లు తొలగింపు, వందేళ్ల వయసు పైబడిన వారిని గుర్తించాలని తహసీల్దారు ప్రసాద్ అన్నారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లిలో జరుగుతున్న ఓటర్ల సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాటాడుతూ ఈ సర్వే ఆగస్టు 21వ తేదీ వరకూ జరుగుతుందని, 22న రాజకీయ పార్టీల సూచనలు మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేస్తామన్నారు. దీంతోపాటు బూత్‌లలో సరాసరి 1500ఓట్లకు మించి ఉంటే కొత్త బూత్ ఏర్పాటు చేయాలన్నారు. ఒక వ్యక్తికి రెండు మూడు ఓట్లు కలిగి ఉంటే వారి అభీష్టం మేరకు ఒక చోట ఉంచి మిగిలినవి తొలగించాలని సూచించారు. సర్వే చేస్తున్న బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలకని కోరారు.



కుతుకుడుమిల్లిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

31న కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి 46 అంశాలపై చర్చ ఉంటుందన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్చాలి



మాధవపట్నంలో బడిబయట పిల్లలను పాఠశాలలో చేరుస్తున్న డీఈఓ తదితరులు

సామర్లకోట: బడి వయసు ఉన్న పిల్లలను సమీప పాఠశాలల్లో చేర్చాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.అన్నపూర్ణ అన్నారు. విద్యార్థుల స్థూల నమోదు సందర్భంగా బుధవారం మాదవపట్నం గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో ఐదు నుంచి 18 ఏళ్ల కలిగిన పిల్లల వివరాలను సేకరించారు. బడిబయట ఉన్న పిల్లలను ఆయా పాఠశాలల్లో చేర్పించాలని ఆమె సూచించారు. ఈ మేరకు పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బడి బయట గుర్తించిన పిల్లలను విద్యాశాఖాధికారి సమక్షంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థూల నమోదు సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెచ్‌ఎం గోవిందరాజులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వర్షాలు.. ప్రజల అవస్థలు

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- నీట మునిగిన వరి నారుమళ్లు



పిఠాపురం మండలం భోగాపురంలో నీట మునిగిన వరి నారుమళ్లు



ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు

పిఠాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటలు నీటమునిగాయి. పిఠాపురం నియోజకవర్గంలో పలు చోట్ల వరినారు మళ్లు నీట మునిగాయి. ముఖ్యంగా ఏలేరు నుంచి అదనపు జలాలు విడుదల చేయడంతో కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. గొల్లప్రోలులో సుద్దగడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో గొల్లప్రోలు పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. ఇప్పటికే గొల్లప్రోలు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై నీరు ప్రవహిస్తుండడంతో నివాసితులకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుపై ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు.

కొత్తపల్లి: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు, ప్రయాణికులు, కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో రోడ్లు వర్షపు నీరు చేరడంతో చెరువులను తలపించాయి. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లను ఆక్రమించి షాపులను ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు పోయేందుకు వీలులేక సుమారు మోకాలెత్తు నీరు నిలిచిపోయింది. వాకతిప్ప పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కుతుకుడుమిల్లి, కొత్తపల్లిలో డ్రైన్లు పూడుకుపోవడంతో నీరంతా వీధుల్లో చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తీరప్రాంతంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొత్తపల్లి: మూలపేటలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం కుప్ప కూలింది. రెండు రోజులగా కురుస్తున్న కారణంతో ట్రాన్స్‌ఫార్మర్ ఉంచేందుకు ఏర్పాటు చేసిన దిమ్మ పూర్తిగా నానిపోయి, కుప్పకూలింది. వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



మూలపేటలో కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం ఆయన కార్యాలయంలో కారుణ్య నియామకం పత్రం అందించారు. దేవీపట్నం మండలం గొందురు గ్రామంలో కురుపల్లి గోపి ఎస్‌జీటీగా పని చేస్తూ అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య టీవీ రామలక్ష్మిని దేవీపట్నం మండల ప్రజాపరిషత్‌లో ఆఫీసు సబార్డినేట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఏపీ పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది పాల్గొన్నారు.